9

# గట్టి బుర్ర

అనగనగా ఒక అడవిలో ఒక భయంకర రాక్షసుడుండేవాడు.

వాడు అప్పుడప్పుడు దగ్గర గ్రామాల మీద పడి ప్రజలను పట్టి తింటుంటేవాడు. ఆ అడవిలోంచి ప్రయాణించేవారి సంగతైతే చెప్పనక్కరలేదు. "ఆ రాక్షసుడిని చంపిన వారికి అర్ధ రాజ్యమిస్తా"నని చాటింపు వేయించారు. కాని, వాడి బలం తెలిసి ఎవరూ ముందుకు రాలేదు.

చివరకి - ఒక పొట్టివాడు తానా పని చేస్తానని చెప్పి బయలుదేరాడు. ఆ మాటలు విని అందరూ ఫక్కున నవ్వుకున్నారు.

పొట్టివాడు అడవికి అవతలనున్న తన మేనమామగారింటికి బయలుదేరాడు. దారిలో తినడానికి ఎన్నో పళ్లు, ఫలహారాలూ, పిండి వంటలూ మూట కట్టుకున్నాడు. అడవిలో రాక్షసుడు ఎదురవుతాడని ఊహించి, ఆ పరిస్థితిలో ఎలా మెసలాలో ముందుగానే నిర్ణయించుకున్నాడు.

అనుకున్నట్లే అడవిలో వెళ్తుంటే పొట్టివాడు రాక్షసుడి కంటపడ్డాడు.

వాడిని చూడగానే రాక్షసుడు మేక మీదకు దూకే పులిలాగా భయంకరంగా అరుస్తూ ముందుకు దూకాడు.

పొట్టివాడు భయపడకుండా "తాతా... నేను నీ కోసమే వచ్చాను." అంటూ వాడి ముందు సాగిలబడి, "ఇవిగో.., ఇవి నీ కోసమే తెచ్చాను" అంటూ పళ్ళూ, ఫలహారాలు వున్న మూటని అందించాడు.

ఎప్పుడూ ప్రేమగా పిలుపు ఎరుగని ఆ రాక్షసుడికి పొట్టి వాడిని చూస్తే ముచ్చటేసింది. వాడిచ్చిన మూటని విప్పి అందులోని ఫలహారాలను ఆప్యాయంగా ఆరగించ మొదలు పెట్టాడు.

ఆ రాక్షసుడు అవి తింటుంటే పొట్టివాడు నేల మీద పడి పొర్లుతూ "అమ్మా...అబ్బా!" అంటూ బాధపడసాగాడు.

అది చూసి రాక్షసుడు "ఎవరు నువ్వు? నీ కేమిటి బాధ..?" 'అని అడిగాడు.




"నేను నీ మనుమడినేట తాతా? దేముడు కలలో కనిపించి చెప్తే నిన్ను చూడాలని వచ్చాను. అయితే నన్ను 'గాను' అనే దయ్యం పట్టి పీడిస్తోంది. దాని వల్ల నాకు అప్పుడప్పుడు ఇలా పొట్టనెప్పి వస్తుంటుంది." అని బాధపడ్తూ చెప్పాడు పొట్టివాడు.

"అదెక్కడుందో చెప్పు..., ఇప్పుడే దానిని చంపేస్తాను" అన్నాడు రాక్షసుడు.

"అంతశ్రమ అక్కరలేదు. నీ ముఖం మీది వెంట్రుకలు రెండు పీకి నాకు ఇస్తే చాలు! వాటిని తాయెత్తులాగా కట్టుకుంటే ఆ దయ్యం నన్నేమీ చేయలేదని దేవుడు కలలో చెప్పాడు" అన్నాడు పొట్టివాడు.

"ఓస్- ఇంతేనా..!" అంటూ తన మీసాల్లోంచి రెండు వెంట్రుకలని పీకి ఇచ్చాడు రాక్షసుడు.

వాటిని తీసుకొని కళ్ళకద్దుకొని, "తాతా... నేను ఊరెళ్ళి మళ్ళీ త్వరలోనే వస్తాను. ఈసారి నీకు ఇంకా ఎన్నో మిఠాయిలు తెస్తాను" అని చెప్పి ముందుకు సాగాడు పొట్టివాడు.

పొట్టివాడు మేనమామ ఇంటికి వెళ్ళాడు. ఆ సమయానికి ఆయన వీధి అరుగుమీద కూర్చుని ఊరి పెద్దలతో మాట్లాడుతున్నాడు. పొట్టివాడు ఆ వెంట్రుకలున్న పొట్లాన్ని ఆయనకిచ్చి, "మామా... నేను స్నానానికి వెళ్లి వస్తాను. ఈ పొట్లాన్ని మాత్రం ఎట్టి పరిస్థితులలోనూ విప్పవద్దు" అని నలుగురూ వినేటట్లు చెప్పి వెళ్ళాడు.

మేనమామ కాక, అక్కడున్న వారందరూ ఉండబట్టలేక ఆ పొట్లాన్ని విప్పి వింతగా చూడసాగారు.

ఇంతలో పొట్టివాడు తిరిగివచ్చి, "అయ్యయ్యో... ఎంతపని చేశారు! చెప్పినా వినకుండా పొట్లాన్ని విప్పారా?" అంటూ మొత్తుకోసాగాడు.

"సరే... పొరపాటయిపోయింది. ఇంతకీ, వీటి రహస్యమేమిటో చెప్పు" అంటూ ఒత్తిడి చేశాడు మేనమామ.

"ఇవి అడవిలోని రాక్షసుడి వెంట్రుకలు. ఇవి ధరించినవారికి ఎటువంటి జబ్బులూ, ఆపదలూ రావు. మీకూ కావాలంటే అందరూ కలిసికట్టుగా వెళ్లి వాడిని చంపి వెంట్రుకలు పీక్కుని రండి" అన్నాడు పొట్టివాడు.

ఈ వార్త చుట్టుప్రక్కల గ్రామాలన్నిటిలోనూ వ్యాపించింది.

వెంటనే ప్రజలందరూ కర్రలూ, కత్తులూ పట్టుకొని గుంపుగా వెళ్లి రాక్షసుడిమీద దాడి చేశారు.

రాక్షసుడు ఎంతటి బలవంతుడైనా- అందరూ ఒక్కసారి వచ్చేసరికి ఏమీచేయలేక,వాళ్ళ చేతిలో చచ్చిపోయాడు. జనం వాడి వెంట్రుకలన్నీ పీక్కు పోయారు.

రాక్షసుడు చచ్చిపోగానే పొట్టివాడు రాజుగారి దగ్గరకి వెళ్లి తన ఘనకార్యాన్ని చెప్పాడు. రాజుగారు సంతోషించి - అన్నమాట ప్రకారం అతడికి అర్ధరాజ్యం ఇచ్చి ఘనంగా సత్కరించాడు.

★★★

